

దీపావళి కథల పోటీలో
పాఠకుల నిర్ణయానికై ఎంపిక చేసిన కథ

అలా నడుచుకుంటూ వెళుతున్నాను. చాలా కాలంగా... ఎంతకాలంగానో మాత్రం తెలియదు. ఇది గమ్యంలేని నడక అని గుర్తించడానికి ఇన్నేళ్ళు పట్టింది.

గమ్యం ఉన్నవాళ్ళందరూ చక్కగా. వేగంగా నడిచిపోతున్నారు. కొందరు బస్సుల్లో, కార్లలో దూసుకుపోతున్నారు. వాళ్ళెవరికీ ఆగే తీరిక గానీ... ప్రపంచాన్ని పట్టించుకునే సమయంగానీ ఉన్నట్టు లేవు. అయితేనేం... చక్కగా ముందుకి పోతున్నారు. పోనీ ఎవర్నైనా గుడ్డిగా అనుసరిద్దామంటే.... వేర్వేరు దిక్కులకి సాగిపోతున్న వాళ్ళలో ఎవర్నని అనుసరించగలను. ఎక్కడ తేల్తానో ఏమో? నాకు కూడా ఒక గమ్యం ఉంటే తప్ప నా నడకకి సార్ధకత ఉండదు. ఎంత తక్కువగా ఉన్నా కోల్పోయిన వాటికన్నా మిగిలిన రోజులు ఎప్పుడూ విలువైనవే. అసలు గమ్యం అంటే ఎలా ఉంటుంది. దానిని నిర్దేశించుకోవడానికి గానీ, దానిని చేరడానికి గానీ సూత్రాలేమైనా ఉన్నాయా? ఏమో.... తెలియదు.

అదిగో.... దూరంగా.... వాళ్ళెవరో కూర్చుని ఉన్నారు. వాళ్ళని కదిలిస్తే నాకు ఉపయోగపడవచ్చు అనిపించి వాళ్ళని సమీపించాను. అందరికీ పెద్ద పెద్ద గడ్డాలున్నాయి. ఎక్కువశాతం తెల్లనివే. అందరూ ఏవో చదువుతున్నారు. మధ్యమధ్యలో తమకి తోచిన వ్యాఖ్యానాలు చేస్తున్నారు. వాళ్ళ చేతుల్లో ఏవో గ్రంథాలు. బాగా పాతవి. గట్టిగా పట్టుకుంటే నుసైపోయేలాంటివి ఉన్నాయి. వాటిని అపురూపంగా పట్టుకుని దీర్ఘంగా చదువుతున్నారు. "ఏమిటి చదువుతున్నారు?" ఒకాయన్ని అడిగాను. "అద్భుతమైన మన పురాతన గ్రంథాలు" అన్నాడు. ఒక దాన్ని తీసుకుని చదవడానికి ప్రయత్నించాను. అర్థం కాలేదు. మరీ పాతదేమో. కొన్ని అక్షరాలు చెరిగిపోయాయి. కొన్ని చోట్ల పదాలు లేవు. పేరాలకి పేరాలు అస్పష్టంగా ఉన్నాయి.

"అర్థం కావడం లేదు" అన్నాను.

"అదేం... ఇంత స్పష్టంగా ఉంటేను" అని నా చేతిలోని దాన్ని తీసుకుని గడగడా చదివేశాడు. ఆశ్చర్యపోయాను.

"అర్థం కాని చోట మన బుద్ధిని ఉపయోగించి స్వంత అర్థం చెప్పుకోవచ్చు" అన్నాడు. తమకు నచ్చని చోట కూడా వాళ్ళు ఇదే పద్ధతిని అనుసరిస్తున్నారని కొంతసేపు మాట్లాడాక అర్థమైంది. ఈ విధంగా పూరించుకుంటూ అస్పష్టంగా ఉన్న మన పూర్వీకుల గురించి సమగ్ర గ్రంథం రూపొందించాం" అని గర్వంగా నవ్వాడు. ఇంక అతనితో మాట్లాడాలనిపించక మౌనంగా వచ్చేశాను.

కొద్దిదూరం వెళ్ళానో లేదో ఎవరో కత్తులకి పదునుపెడుతూ కనిపించారు. తలొంచుకుని వారిని దాటి పోబోయేను.

"నువ్వు అమర్ కదూ" అన్నాడు వాళ్ళల్లోంచి ఒకడు ముందుకు వచ్చి.

"కాదు" అన్నాను భయంగా.

"అమర్‌లాగే ఉన్నావు... నిజం చెప్పు" గద్దించాడు. వాళ్ళవాళ్ళు నలుగురూ వచ్చి అతని వెనుక చేరి నాకేసి అనుమానంగా చూడసాగారు.

"అసలు.... అమర్ ఎవరో నాకు తెలియదు"

"సరే... వెళ్ళు. వాడెక్కడ తప్పించుకుంటాడు. ఒక్కవేటుకి నరికేస్తాను" అని కత్తి పదును పరీక్షించడానికేమో కత్తి మొనమీద వేలితో రాశాడు. చర్మం తెగి, రక్తం బొటబొటా కారింది. అతను బాధగా అరవలేదు సరికదా.... "భలే పదునుగా ఉంది" అని వికటాట్టహాసం చేశాడు.

"ఒకమనిషిని చంపేస్తారా? ఎందుకు?"

"వాడు మా ఆలోచనలకి భిన్నంగా రాస్తున్నాడు. ఫలితం అనుభవిస్తాడు."

"అంతేనా... ఇంకా మీకేదో ద్రోహం చేశాడనుకుంటున్నాను."

"వీడు చేసింది అంతకన్నా దారుణం. వీడిని ఉపేక్షిస్తే ఇంకొకడు అలాగే రాస్తాడు".

"రాసిన దాంట్లో సరుకుంటే నిలబడుతుంది. పొల్లయితే గాలికి పోతుంది. మధ్యలో మీకెందుకీ హైరానా?" అన్నాను ధైర్యంచేసి. మీది ద్వేషమా... భయమా అని అడగాలనిపించింది కానీ నిగ్రహించుకున్నాను. వాడిని సమర్ధిస్తున్నావు... ఎంత ధైర్యంరా నీకు" అని అరిచాడు. భయంవేసి వాళ్ళని తప్పించుకుని జనంలో కలిసిపోయాను. వెనుక ఎవరూ రావడం లేదని ధైర్యం చిక్కక మళ్ళీ ఆలోచనలు నన్ను వెంటాడాయి. నడిచి వెళుతున్న నన్ను ఒకతను ఆపాడు.

"ఇది తీసుకోండి" అన్నాడు.

"ఏమిటిది?"

"మీ నమ్మకాన్ని మార్చుకోవలసిన సమయం ఆసన్నమైంది"

"అసలు నాకు నమ్మకమే లేదు. ఇంక మార్చుకునే అవకాశమేముంది?"

"అయితే మీకు మొదటి నుంచీ చెప్పాలి" అని ఏవేవో చెప్పుకుపోతున్నాడు.

"మీది వ్యర్థ ప్రయత్నం" అన్నాను. అయినా అతను ఆగలేదు.

"నేను వస్తాను" అని బయలేర్దాను.

"రేపు కలిసి మిగతాది చెప్తానేం" అన్నాడు.

"నేను నీకు దొరికితేగా" అన్నాను.

"నేను నిన్ను ఒదిలేతేగా" అని వెళ్ళిపోయాడు. రేపటి సంగతి రేపు చూసుకోవచ్చు. ప్రస్తుతానికి ఒదిలాడు కదా అని సంతోషించి మళ్ళీ నడక సాగించాను.

జన సమూహాలు తలో దిక్కుకీ ఎప్పటిలాగే కదలిపోతున్నాయి. పైకి సమూహాలుగా కనిపిస్తున్నారు కానీ, అందరూ విడివిడిగా ఎవరికి వారుగా కదలిపోతున్నారు. వేగం ఇదివరకటి కన్నా పెరిగింది. ఇదే అంతిమ ప్రయాణం అన్నట్టుగా గబగబా సాగిపోతున్నారు.

ఈ సమూహాలలోంచి నా సందేహాలని తీర్చగల వ్యక్తిని పట్టుకోవాలి. అంతలో ఒక పెద్దాయన కనిపించాడు. అనుభవజ్ఞుడు. నాకు దారి చూపించగలవాడు అనిపించి, ఆయన్ని ఆపాను. నా సమస్య ఆయనకి వివరించాను.

"ఆశ్చర్యంగా ఉందే... ఇంత వయస్సొచ్చింది... ఇంకా ఎక్కడికి వెళ్ళాలో తెలియడం లేదా?"

"మీకు తెలుసా?" అడిగాను.

"బాగా తెలుసు. అక్కడికి వెళ్ళి '12 బి' బస్సు పట్టుకో. 13 కూడా వెళుతుందనుకో. కానీ చుట్టు తిరిగివెళుతుంది. ప్రసాద్ థియేటర్ దగ్గర దిగు. అక్కడి నుంచి కొద్దిగా ముందుకి వెళితే రామాలయం వస్తుంది. దాని ప్రక్కన ఉన్న పెద్ద బిల్డింగ్" అన్నాడు.

"ఏముందక్కడ?"

"మా ఆఫీసు".

"అది నాకెందుకు?"

"అయితే.... వెనక్కి వెళ్ళి కుడిచేతివైపు రెండో వీధిలోకి తిరిగితే నాలగో పచ్చడాబా"

"అక్కడేముంది?"

"అది నా ఇల్లు".

"నాకు కావలసినవి ఇవికావు".

"ఇవి తప్ప నాకింకేం తెలియవే. ఆ... తెలుసు. మెయిన్ రోడ్డులో ఉన్న అప్పారావు కిరాణా షాపు. నాకు ఖాతా ఉంది. మావీధి చివర కూరల కొట్టు...." ఇంకా ఏవో చెప్పబోతున్నాడు. "ఆపండాపండి. ఇంత వయస్సొచ్చింది. ఇవిగాక ఇంకేం తెలియవా? "ఎందుకు తెలియాలి. ఇన్నేళ్ళుగా నాకా అవసరం రాలేదు. నాకే కాదు ఎవరికైనా అంతే" అని ఈదుతున్నట్టుగా వెళ్ళి జనసమూహంలో పడి కొట్టుకుపోయాడు.

ఇంకెవర్ని అడగాలో తోచలేదు. చుట్టు ప్రక్కల చూశాను. ఒకతను చేతులు వెనక్కి

కట్టుకొని, ఆకాశంకేసి దీర్ఘంగా చూస్తున్నాడు. గడ్డం పెరిగి వుంది. కళ్ళు తీక్షణంగా ఉన్నాయి. మేధావిలా ఉన్నాడు. ఇతనే సరైన వ్యక్తి అనిపించి అతని దగ్గరకు వెళ్ళి అడిగాను. అతను మాట్లాడకుండా పక్కకు వెళ్ళి అప్పటికే సిద్ధంగా ఉన్న కేన్వాస్ మీద ఏదో గీయసాగాడు. అతన్ని డిస్టర్బ్ చేయడం ఇష్టంలేక ఓపికగా నుంచున్నాను. కొద్దిసేపటి తరువాత అతను నాకేసి చూసి, నవ్వి "ఇలా రా" అన్నాడు. నేను వెళ్ళి ఏం గీశాడా అని ఆసక్తిగా చూశాను.

నాలుగురోడ్ల కూడలిని,అక్కడ నుంచుని అయోమయంగా దిక్కులు చూస్తున్న ఒక మనిషిని గీసాడతను. దానికింద 'గమ్యం తెలియని బాటసారి' అని రాశాడు. ఏమనాలో తెలియక చిరాకుగా అక్కడి నుంచి దూరంగా వెళ్ళి నుంచున్నాను.

నా సందేహం నివృత్తి చెయ్యగలవారు ఎక్కడో ఉండే ఉంటారు. కానీ ఎలా పట్టుకోవడం.

అలా ఆలోచిస్తున్న నాముందు నుంచి వెళ్ళిపోతున్న ఒకతను ఆగి నాకేసి తేరిపార చూశాడు. అప్పుడు అతనికేసి తల తిప్పి చూసిన నేను వణికిపోయాను.

అతని చేతిలో గొడ్డలి ఉంది. దాని పదునైన అంచునుండి – అతను తాజాగా చేసిన హత్య తాలూకు రక్తం చుక్కలు... అంతకాలం ఒకరి శరీరంలో ప్రవహించి మొదటిసారిగా బయటి ప్రపంచాన్ని చూస్తున్న రక్తం చుక్కలు... కన్నీళ్ళులా కారుతున్నాయి.

"నువ్వు ఖాళీగా ఉన్నట్టున్నావు" అన్నాడు. భయం వల్ల బదులు చెప్పలేదు.

"ఎవ్వరూ ఖాళీగా... సోమరులుగా ఉండటానికి వీల్లేదు. ఈ గొడ్డలి తీసుకో"

"అది నాకెందుకు?" భయంగా అన్నాను.

"ఎదురుగుండా కనిపిస్తోంది చూడు... ఆ బిల్డింగ్‌లోకి వెళ్ళు. మెడలో బంగారు గొలుసులు, వేళ్ళకి బంగారు ఉంగరాలతో ఒకడు కనబడతాడు. ప్రక్కనే లావుగా.... ఒంటినిండా నగలు దిగేసుకున్న వాడి భార్యా.... పిల్లలు కనబడతారు. అందర్నీ నరికెయ్" బిగ్గరగా అన్నాడు.

"అమ్మో నరకడమే"

"కొత్తలో అలాగే ఉంటుంది. పోను... పోను దీనిలో మజా నీకే తెలుస్తుంది.

"అయినా ఎందుకు నరకడం. వాళ్ళు నీకేం ద్రోహం చేశారు"

"ఇది నా స్వవిషయం కాదు. సమాజానికి పట్టిన చీడపురుగులు వీళ్ళు. ఒక్క వీళ్ళేకాదు... ఇంకా చాలామంది ఉన్నారు" అని జేబులోంచి ఒక పెద్ద లిస్టుని బయటకు లాగాడు.

"ఓటర్ల లిస్టా"

"కాదు.... నరకాల్సిన వాళ్ళ లిస్టు. వీళ్ళందరి వివరాలు నీకు చెప్పడం... నువ్వు గుర్తుంచుకోవడం కష్టం. సింపుల్‌గా చెబుతాను విను. కార్లలో తిరిగేవారిని, బంగారు నగలు దిగేసుకునేవారిని, ఎ.సి.లలో కులికేవారిని... సంక్షిప్తంగా చెప్పాలంటే డబ్బున్నవాళ్ళనందర్నీ నరికెయ్"

"ఎందుకు"

"వాళ్ళందరూ పోతే లేని వాళ్ళందరూ కలిసి సమసమాజాన్ని స్థాపించొచ్చు. మధ్య తరగతి వాళ్ళు ఎలాగూ చచ్చినట్లు మనతోనే కలుస్తారు".

"ఇలాఎంత మందినని నరకడం... నా ఒక్కడివల్లా ఏం అవుతుంది. పైగా పోలీసుల సమస్య ఒకటుంటుంది. తప్పించుకోవడానికి అన్నాను. "నువ్విట్నుంచి మొదలు పెట్టు. అట్నుంచి వేరే బేచ్ నరుక్కుంటూ వస్తుంది. అందరూ కలిస్తే అనుకున్న పనిని పూర్తి చేయడానికి ఎక్కువకాలం పట్టదు. పోలీసుల సంగతి చూసుకోవడానికి మరో బేచ్ ఉందిలే" ఇదంతా చాలా ఈజీ విషయంలా చెప్పేశాడు.

"మీ గొడ్డలి నాకిచ్చేస్తే... మరి మీకో..."

"నరికి... నరికి... అలిసిపోయాను. అంటే రెస్ట్ తీసుకుంటాననుకునేవు. మీరు నరుకుతూంటే వెనుకనుంచి సూచనలు, సలహాలిస్తాను"


"నాదొక ప్రశ్న".

"అనవసర ప్రశ్నలతో టైం వేస్టు చేస్తున్నావు. ఆలోచించేవాడు ఆచరణకి పనికిరాడు. ఆలోచన మాది, పని మీది"

"చివరి ప్రశ్న"

"సరే అడుగు."

"మీ మెడలోని గొలుసులు, చేతికున్న ఉంగరాలు చూస్తుంటే మీరు కూడా డబ్బున్న వారిలాగే ఉన్నారే" అన్నాను ధైర్యం కూడగట్టుకొని. "అర్నీ... నీ కన్ను నామీద పడిందీ... ఉండు నీపని చెబుతాను" అని నా చేతిలోని గొడ్డలిని లాక్కొన్నాడు. అంతే... ఒక్క దూకు దూకి పరిగెట్టాను. అతను నావెంట పడ్డాడు. నాకిపుడు గమ్యం గురించి ఆలోచనే లేదు.




డా॥ ఎన్.గోపి రచించిన 'నానీలు' ఇంగ్లీషు అనువాదం నానీలు : ద లిటిల్ వన్స్ ను హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆంగ్లశాఖాధిపతి ప్రొ॥ అల్లాడి ఉమ హైదరాబాద్ సెంట్రల్ లైబ్రరీలో ఆవిష్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో డా॥ లక్ష్మి హరిబండి (సీఫెల్), అనువాదకురాలు ప్రొ॥ పి. జయలక్ష్మి, సభాధ్యక్షురాలు ప్రొ॥టుటున్‌ముఖర్జీ, మూలకవి గోపి, పబ్లిషర్ ఉమేష్ చంద్ర అగర్వాల్ (ఎ.పి. బుక్స్, ఢిల్లీ) లు ఉన్నారు.